నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 14 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

'అమ్మ ఆదర్శ' పనులు త్వరగా పూర్తవ్వాలి

అదనపు కలెక్టర్ రాహుల్

పాఠశాలను పరిశీలించి సూచనలు చేస్తున్న రాహుల్

భీమారం, జూన్ 13 : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తవ్వాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ సూచించారు. గురువారం పోలంపల్లి గ్రామ పంచాయతీలోని అంకుశాపూర్‌లోగల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మద్దికల్‌లోని నర్సరీని పరిశీలించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో పర్యటించి మిషన్ భగీరథ సర్వేను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో రాధ రాథోడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోడు సమస్య పరిష్కారానికి సహకరించాలి

జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

ఎఫ్ఆర్వో సుధాకర్‌తో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

పెంచికల్‌పేట్, జూన్ 13 : పోడు భూముల సమస్య పరిష్కారానికి అటవీ అధికారులు సహకరించాలని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయానికి రైతులతో కలిసి వెళ్లారు. లోడ్పల్లి, కొండపల్లి గ్రామాల రైతులు అధికంగా పోడు వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారని, వ్యవసాయం చేసుకునేలా వారికి అధికారులు సహకరించాలని కోరారు. జాయింట్ సర్వే నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందించాలన్నారు. మాజీ సర్పంచులు సంజీవ్, శ్రీనివాస్, నాయకులు సముద్రాల రాజన్న, తిరుపతి రైతులు పాల్గొన్నారు.

ఒర్రెను పూడ్చేసి కబ్జా!

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని సర్వే నంబర్-45లో రెండెకరాలు స్వాహా

- 100 మీటర్ల వెడల్పు ఉన్న కెనాల్‌ను పూడ్చి 10 మీటర్లకు తగ్గింపు
- ఆక్రమిత భూమిలో ప్లాటింగ్ చేసేందుకు రియల్టర్ల యత్నం
- మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్‌తో సంబంధం లేకుండా నిర్మాణాలు
- గతంలోనూ ఐదారు ఎకరాలు మింగేసి విక్రయాలు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

కాలువ(ఒర్రె)ను ఆక్రమించి గోడలు నిర్మిస్తున్న ప్రైవేటు వ్యక్తులు

మంచిర్యాల, జూన్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో పరిధిలోని సర్వే నంబర్-45లో గల ఒర్రెను పూడ్చేసి, రెండెకరాల దాకా కబ్జా చేసినా యంత్రాంగం 'మూమూలు'గా తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది. క్యాతన్‌పల్లి చెరువు అలుగు పారినప్పుడు ఈ కాలువ(ఒర్రె) ద్వారా ప్రవాహం వచ్చి రాళ్లవాగులో కలుస్తుంది. దాదాపు నాలుగైదు కిలోమీటర్ల మేర 100 మీటర్ల వెడల్పుతో పారే ఈ ఒర్రెను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా కబ్జా చేశారు. ఒర్రెను మింగేయడమేగాక 10 మీటర్ల వెడల్పుతో సొంతంగా కాలువ తవ్వి, ఆ కాలువకు ఇరువైపులా గోడలు సైతం కట్టుకుంటూ పోతున్నారు. ఇప్పటికే రెండు కిలోమీటర్ల మేర కాలువకు ఇరువైపులా గోడల నిర్మాణం చేపట్టారు. 100 మీటర్లుగా పైగా విస్తీర్ణమున్న ఈ ఒర్రె, ఈ నిర్మాణాల తర్వాత 10 మీటర్లే ఉండడం గమనార్హం. కాలువ లోపల గోడలంటూ నిర్మిస్తే ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ లేక మున్సిపల్ శాఖ లేక రెవెన్యూ శాఖ నిర్మించాలి. కానీ ఇక్కడ ప్రభుత్వంతో సంబంధం లేకుండా ప్రైవేట్ వ్యక్తులు ఒర్రె లోపల గోడలు కట్టుకుంటూ పోతున్నారు. ఒర్రెను ఆక్రమించి కొన్ని రోజులుగా ఈ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

గతంలో కొంత.. ఇప్పుడు మరికొంత..

గతంలోనూ ఈ ఒర్రె భూమిని కొంత కబ్జా చేసిన అక్రమార్కులు ప్లాటింగ్ చేసి మరీ అమ్మేసినట్లు తెలుస్తున్నది. ఇప్పుడు ఒర్రెలో ఓ పక్కన నిర్మాణాలు సాగుతుండగా, కొన్ని రోజుల ముందే మరో పక్కా ఇదే తరహా నిర్మాణాలు చేశారు. దాదాపు ఐదారు ఎకరాలు ప్లాటింగ్ చేసి మరీ అమ్మేశారు. ఇప్పుడు ఆక్రమించిన భూమిని సైతం ప్లాటింగ్ చేసేందుకు సిద్ధమయ్యారు. గతంలో అన్ని శాఖల అధికారులకు డబ్బులు ఇచ్చి, దర్జాగా కబ్జా చేసి ప్లాటింగ్ చేసి అమ్మేశారని, అప్పుడు కాలువ పక్కన బఫర్ జోన్ లేకుండానే ప్లాటింగ్ చేశారని స్థానికులు చెబుతున్నారు. భారీ ప్రవాహంతో వచ్చే ఒర్రెకు బఫర్‌జోన్ ఉందని, అది కూడా వదిలేయకుండా అక్రమార్కులు ఇష్టారాజ్యం చేస్తున్నారని పక్కన వ్యవసాయ భూములున్న రైతులు వాపోతున్నారు. పెద్ద ఒర్రెను చిన్న మురుగు కాలువగా మార్చి గోడలు కడుతుంటే ఇటువైపు వచ్చి చూసిన నాథుడే లేడంటూ పోయాడాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు లంచాలు ఇవ్వకుండా ఇది ఎలా సాధ్యమవుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమాలు తొలగించి కాలువను పునరుద్ధరించుకుంటే తమ భూముల్లోకి నీరు చేరి మునిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

కోర్టులో కేస్ ఉండగానే..

ఒర్రె కబ్జాకు గురైంది. పోనీ సొంత భూమిలోనైనా ప్లాటింగ్ చేస్తున్నారేమో అనుకుంటే అదీ లేదు. సర్వే నంబర్ 45లో వారసులకు మధ్య గొడవలు నడుస్తున్నాయి. ఈ భూమిని కొనకూడదు, అమ్మకూడదని కోర్టు 2013లోనే ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. కానీ దానిని పక్కన పెట్టి వారుసుల్లో ఒక్కరు మిగిలిన వారిని బెదిరింపులకు గురిచేసి మరీ ఒర్రెను ఆక్రమించుకొని మరీ ప్లాటింగ్ చేసి అమ్మేస్తున్నట్లు తెలుస్తున్నది. కాగా, ఇక్కడ కొన మెరుపు ఏమిటంటే కోర్టు కేసు ఉన్న భూమిలో ప్లాటింగ్ చేసేందుకు దరఖాస్తు చేసుకోగా, రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే చేసి వెళ్లినట్లు తెలుస్తున్నది. గతంలో ప్లాటింగ్ చేసి అమ్మేసిన భూమి సైతం కోర్టు కేసుల్లో ఉండగానే అమ్మేశారనే ఆరోపణలున్నాయి. మరీ ఇంతగా కోర్టు ఆదేశాలను ధిక్కరించి మరీ అక్రమార్కులకు అధికారులు ఎందుకు సహకరిస్తున్నారనేది తెలియడం లేదు. ఈ మధ్య వారసుల్లో ఒక్కరైన వ్యక్తి న్యాయం కోసం వెళ్తే కోర్టు ఆదేశాల మేరకు ఆ భూమిలోకి ఎవరూ రాకుండా పరిరక్షించాల్సిన అధికారులే.. సదరు వ్యక్తిని బెదిరించినట్లు సమాచారం. విషయం పెద్దది కాకుండా కాంప్రమైజ్ చేసుకోవాలంటూ పోలీసులు ఒత్తిడి తీసుకురాగా, సదరు బాధితుడు న్యాయం కోసం కలెక్టర్, సీపీ, డీసీపీ, ఎంఆర్‌వో, మున్సిపల్, ఇరిగేషన్ ఇలా అన్ని శాఖల్లో ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరి ఆయన వెళ్లి ఫిర్యాదు చేశాకైనా కదలాల్సిన యంత్రాంగం ఇప్పటి వరకు కనీసం అక్కడికి వెళ్లి పరిశీలించిన దాఖలాలు లేవు.

మా పరిధిలోకి రాదు ఇరిగేషన్.. మాది కూడా కాదు మున్సిపల్

ఒర్రెను కబ్జా చేసి రెండెకరాలు ఆక్రమించి ప్లాటింగ్ చేస్తున్న విషయంపై మందమర్రి ఇరిగేషన్ శాఖ డీఈ శారదను వివరణ కోరగా ఇది ఇరిగేషన్ పరిధిలోకి రాదన్నారు. మున్సిపల్ పరిధిలోకి వస్తుందని మీరు వెళ్లి వారినే కలవండని చెప్పారు. ఇదే విషయంపై క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణను వివరణ కోరగా చెరువుకు సంబంధించిన ఒర్రె ఇరిగేషన్ వాళ్లది కాకుండా మాది ఎలా అవుతుందన్నారు. ఆ ఫొటోలు పంపండి చూస్తా అని చెప్పిన ఆయన, ఫొటోలు వాట్సప్ చేశాక చూసి మా టౌన్ ప్లానింగ్ అధికారికి పంపించామని.. విచారణ చేస్తామని చెప్పారు. ఇలా అధికారులు ఎవరికి వారు మాది కాదంటే.. మాది కాదంటూ తప్పించుకునే ప్రయత్నాలు చేశారు. మరి ఇప్పటికైనా ఈ వ్యవహారాన్ని అటు ఇరిగేషన్, ఇటు మున్సిపల్ శాఖలు సీరియస్‌గా తీసుకోకపోతే కబ్జాకు గురైన కాలువతో చుట్టు పక్కల ప్రాంతాల వారికి ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తారా.. లేకపోతే అక్రమార్కులకే కొమ్ము కాస్తారా అనేది తేలాల్సి ఉంది.

ఒర్రెను పూడ్చేసి పాత వెంచర్‌లో కాలువకు ఇరువైపులా కట్టిన గోడలు

ఆక్రమిత భూమి పక్కన 100 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పులో కనిపిస్తున్న ఒర్రె

గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు

మొక్కలు నాటేందుకు సహకరించాలి

- ఇటుకలపాడులో 250 హెక్టార్లలో పెంపకం
- కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో అప్పలకొండ

సిర్పూర్(టీ), జూన్ 13 : సిర్పూర్(టీ) అటవీ శాఖ రేంజ్ పరిధిలోని ఇటుకలపాడు అటవీ ప్రాంతంలోని 250 హెక్టార్లలో మొక్కలు నాటేందుకు గ్రామస్తులు సహకరించాలని కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో అప్పలకొండ అన్నారు. గురువారం ఇటుకలపాడులో గురువారం అర్డీవో సురేశ్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో పూర్ణచందర్ రావు, సిర్పూర్(టీ) ఎస్ఐ దీకోండ రమేశ్‌లతో కలసి గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇటుకలపాడు గ్రామం పూర్తిగా రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని, పులుల సంచారానికి అవాంతరాలు తొలగించేందుకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇటుకలపాడులో గతంలో 250 హెక్టార్లలో మొక్కలు నాటామని, ఈసారి మరో 250 హెక్టార్లలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, అర్హులైన గ్రామస్తులకు జీవనం సాగించేందుకు అటవీ ప్రాంతంలో కొంత భూమి ఇవ్వడానికి అటవీ అధికారులు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయమై రెండు, మూడు రోజుల్లో తమ నిర్ణయం వెల్లడిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు మోహన్, సిర్పూర్(టీ) రేంజ్ అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ, సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

న్యాయం చేస్తామనే నమ్మకం కలిగించాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్
- శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌న తనిఖీ

శ్రీరాంపూర్, జూన్ 13 : వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు న్యాయం చేస్తామనే నమ్మకం కలిగించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ శ్రీనివాస్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. సీపీకి సీఐ మోహన్, ఎస్ఐ సంతోష్ స్వాగతం పలికారు. అనంతరం సీపీ పోలీసు స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు గురించి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ సరిహద్దులు, భౌగోళిక పరిస్థితులు, పరిధి గ్రామాల వివరాలను మ్యాప్ ద్వారా ఎస్ఐ సంతోష్ వివరించారు. సీపీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీప్రసన్న, పోలీసులు పాల్గొన్నారు.

ఆఖరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

నస్పూర్, జూన్ 13 : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఆఖరి గింజ వరకూ కొనుగోళ్లు చేపడుతామని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని 24,532 మంది రైతుల వద్ద 1,56,116 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించామని, రూ. 267.53 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

2025లో నిర్వహించే గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని పద్మ అవార్డుల ప్రదానోత్సవం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల పరిధిలోని పద్మ అవార్డుల కోసం నిర్ణీత నమూనాలో 800 పదాలకు మించకుండా ఈ నెల 15లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు పద్మఅవార్డ్స్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు

సీఎంను కలిసిన ఆర్ఎంపీ, పీఎంపీలు

సీసీసీ నస్పూర్, జూన్ 13 : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న దాడుల నేపథ్యంలో తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ నాయకులు గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీలను నిలిపివేయాలని, పెట్టిన కేసులను ఎత్తివేయాలని అసోసియేషన్ నాయకులు ముఖ్యమంత్రిని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించి, తనిఖీలు నిలిపివేయాలని అధికారులను ఆదేశించినట్లు వారు తెలిపారు. గతంలో ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చిందని, ఇందుకు సంబంధించిన పత్రాలను అందజేయాలని సీఎంను కోరినట్లు వారు తెలిపారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు నేతి నాగేశ్వర్‌రావు, హనుమంతరావు, రాజమౌళి, రొడ్డ రాజేశం, చుంచు శంకర్‌వర్మ, వెంకటేశ్ ఉన్నారు.

పరీక్ష విధానం రద్దు చేయాలి

- ఆశ కార్యకర్తల డిమాండ్
- ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 13 : పరీ విధానాన్ని రద్దు చేయాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు ఆంధ్రప్రదేశ్‌లోచెల్లిస్తున్నట్లు కనీస వేతనం రూ.10000 చెల్లించాలని కోరారు. కనీస వేతనం పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలన్నారు. పని భారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి, జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి, ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, ప్రధానకార్యదర్శి, నగరం పద్మ, నాయకులు ఓమలా, కేసరా నవీన, రాజేశ్వరీ, రంభ, సక్రుబాయి, సునీత, భద్రుబాయి, అరుణ, కవిత, నిర్మలా సుమలత, భాగ్య పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

జాతీయ విద్యా విధానంపై అవగాహన పెంచుకోవాలి

మను యూనివర్సిటీ ప్రొఫెసర్ వనజ

అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ వనజ

లక్షెట్టిపేట, జూన్ 13 : జాతీయ విద్యా విధానం-2020పై అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని మౌలానా ఆజాద్ నేషనల్ యూనివర్సిటీ (manu) డీన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ వనజ అన్నారు. గురువారం లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, విజ్ఞానం ప్రపంచానికి విశ్వగురువులా వర్ధిల్లుతుందని వివరించారు. మన దేశంలో చదివిన మేధావులు ఇతర దేశాలకు వెళ్లకుండా చేయడమే లక్ష్యంగా అధ్యాపకులు పని చేయాలన్నారు. అధ్యాపకులు నూతన విద్యావిధానంలో వచ్చే మార్పులను అవలోకనం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగయ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సవిత, ఇంటిగ్రేట్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పడాల తిరుపతి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ

సర్వాయిపేటలో ఎరువులు, విత్తనాల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ

కోటపల్లి, జూన్ 13 : రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ సూచించారు. గురువారం కోటపల్లి, సర్వాయిపేట గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల విక్రయాల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్ వద్ద విత్తనాలు, ఎరువుల స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రశీదులు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. అధీకృత డీలర్ వద్దే ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, కలిగి ఉన్నా చర్యలు తప్పవని, రైతులకు నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు లేక వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో మహేందర్ పాల్గొన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679